విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 1, జనవరి 2026

# ప్రశ్నిస్తే ఏఐఎస్ఎఫ్ నాయకులపైన రౌడీ షీటా..?

**విశాలాంధ్ర బ్యూరో- అనంతపురం:** రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపైన విశాఖపట్నంలో రౌడీషీట్ ఓపెన్ చేయడాన్ని ఖండిస్తూ బుధవారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కోట్రేష్ మాట్లాడుతూ విద్యార్థులకు యువతకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపైన పోరాటాలు నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపైన ఉద్యమా లకు సంబంధించిన పాత కేసులు తోడి విశాఖపట్నంలో ఐదు మంది విద్యార్థి, యువజన నాయకులపైన రౌడీషీట్ ఓపెన్ చేయడానికి ఖండించారు. తక్షణమే రౌడీషీట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రితో సహా చాలామందిపైన పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయి వాటి ఆధారంగా వారి పైన రౌడీషీట్ ఓపెన్ చేస్తారా అని ఐజిని నిలదీశారు. రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం బైజు సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆందోళన చేసిన నాయకులపైన అప్పటి ప్రభుత్వం కేసు పెడితే రెండేళ్ల తర్వాత పాత కేసులను తోడి రౌడీషీట్ ఓపెన్ చేశారని మండిపడ్డారు.

నారా లోకేష్ ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువజనలు, ఉపాధ్యాయులు, కార్మికులకు ఉద్యమాలు చేస్తున్న అనేక సంఘాలకు వైసిపి పెట్టిన కేసులు ఎత్తేస్తామన్న మాటపై నిలబడాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి చందు, నగర అధ్యక్షులు మంజునాథ్, ఏఐవైఎఫ్ నగర్ అధ్యక్షులు ఆనంద్, ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకులు సమీర్, సాయి, సురేంద్ర, రాకేష్, రియాజ్, సన్నీ, తేజ, కార్తీక్, ఉదయ్, ఎర్రిస్వామి, అజయ్, బన్నీ, సోహియల్, యశ్వంత్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

**విశాలాంధ్ర-ఉరవకొండ :** విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య యువజన సమాఖ్య నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం రౌడీషీట్‌ను ఓపెన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బైజు సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆందోళన చేసిన నాయకులపైన అప్పటి ప్రభుత్వం కేసులు పెట్టిందని, ఆ పాత కేసులు అన్నీ తోడి విద్యార్థి యువజన నాయకులపైన విశాఖపట్నంలో రౌడీషీట్ ఓపెన్ చేశారని మండిపడ్డారు. పాత కేసులు ఎత్తివేస్తామని అనేక సభలలో సమావేశాలలో ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నారాలోకేష్ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారని నేడు ప్రశ్నించే వారిని అణిచివేసి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఒక హిట్లర్ పరిపాలనను తలపిస్తూ రౌడీషీట్లు, పీడీ యాక్టు ఓపెన్ చేసి ఉద్యమాలను అణిచివేయా లని చూస్తున్నారని మండిపడ్డారు, విద్యార్థి సంఘాల నాయకులు మర్డర్లో, మానభంగాలు చేయలేదని విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని గుర్తు చేశారు. రౌడీషీట్‌ను వెంటనే ఎత్తివేయాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దపోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రఘు, సంతోష్, భరత్ పాల్గొన్నారు.

## రౌడీషీట్లు ఎత్తివేయాలి

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం :** విశాఖపట్నంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై రౌడీషీట్లు ఓపెన్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ముందు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్షులు హనుమంత రాయుడు మాట్లాడుతూ, విద్యార్థులు-యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని

ప్రశ్నించినందుకే నాయకులపై పాత కేసులను తెరపైకి తెచ్చి రౌడీషీట్లు ఓపెన్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, ముఖ్యమంత్రి వరకు పలువురిపై కేసులు ఉన్నా వారి విషయంలో రౌడీషీట్లు ఎందుకు ఓపెన్ చేయడం లేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలో విద్యార్థులతో పెట్టుకున్న ప్రభుత్వాలు నిలిచిన దాఖలాలు లేవని హెచ్చరించారు. రౌడీషీట్లను తక్షణమే ఎత్తివేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రజని, మురళి, సహాయ కార్యదర్శి నందకిషోర్ గురు, నాయకులు సాయి, సంతోష్, వంశి, శివకుమార్, మను, కార్తీక్, అభి తదితరులు పాల్గొన్నారు.

## అణిచివేతకు పాల్పడటం తగదు

**విశాలాంధ్ర-యాడికి :** ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి యువజన నాయకులపై రౌడీషీట్లు ఓపెన్ చేయడాన్ని ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్ యాడికి మండలంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ తాడిపత్రి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్ మాట్లాడుతూ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ శాంతియుత ఉద్యమాలు నిర్వహించిన నాయకులపై పాత కేసులను ఆధారంగా చూపి రౌడీషీట్లు తెరవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నిస్తే అణిచివేతకు పాల్పడటం తగదన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వినోద్, సురేష్, రమేష్, కిరణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# కేటాయించిన శాతం ప్రకారం నిధులు ఖర్చు చేయాలి

## కలెక్టర్ ఓ.ఆనంద్

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:** షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం ఆయా శాఖల పరిధిలో కేటాయించిన పర్సంటేజ్ ప్రకారం పూర్తి స్థాయిలో నిధులు ఖర్చు చేసేలా చూడాలని కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాల్లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లాస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖచ్చితంగా ఖర్చు చేసేలా చూడాలని ఆయా శాఖల జిల్లా అధికారులకు సూచించారు. లక్ష్యం మేరకు ప్రభుత్వం నుండి అందే సహాయ సహకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఎస్సి, ఎస్టీ లబ్ధిదారులకు లబ్ధి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిఆర్ డిఏ పరిధిలో స్త్రీనిధి కింద రుణాల మంజూరులో, ఉన్నతి, పీఎంఎఫ్ఎంఈ లక్ష్యాలకు సంబంధించి పురోగతి తీసుకురావాలని, ఉపాధి హామీ కింద ఎస్సీ, ఎస్టీలకు లబ్ధి చేకూర్చాలని, హౌసింగ్, ఏపీఎంఐపీ, అగ్రికల్చర్, సివిల్ సప్లై, మున్సిపాలిటీ ఇతర అన్ని శాఖల పరిధిలో వారికి కేటాయించిన లక్ష్యాలను చేరుకోవడంపై దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లతో సోషల్ వెల్ఫేర్ డీడీ, డిటిడబ్ల్యువోలు మాట్లాడి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం కేటాయించిన పర్సంటేజ్ ప్రకారం నిధులు ఖర్చు చేసేలా చూడాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగలకు లబ్ధి చేకూర్చేందుకు ఆయా శాఖల అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ జెడి ఖుష్బూ కొఠారి, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జెడి ప్రేమ్ చంద్, జెడ్పి సీఈవో శివశంకర్, డిపిఓ నాగరాజు నాయుడు, డిఆర్డిఏ పిడి శైలజ, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, డిసిఓ అరుణకుమారి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, సిపిఓ అశోక్ కుమార్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, హార్టికల్చర్ ఉమాదేవి, ఏపీఎమ్ఐపి పిడి రఘునాథరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముద, డ్వామా పీడీ విశ్వ జ్యోతి, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, డీఈవో ప్రసాద్ బాబు పాల్గొన్నారు.

## పింఛన్లు ఒక వరం

**విశాలాంధ్ర-బెలుగుప్ప :** ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు ఒక వరం లాంటిదని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున పేర్కొన్నారు. బుధవారం మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒక్కరోజు ముందుగానే అధికారులు నాయకులతో కలిసి ప్రతి ఇంటింటికీ వెళ్లి పెన్షన్‌దారులకు అందించారు మండల వ్యాప్తంగా 5650 పెన్షన్లు ఉండగా 5206 పంపిణీ చేశారు. 92.14 శాతం పూర్తి చేశారు. అందజేశామన్నారు మిగిలిన 444 మంది లబ్ధిదారులకు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఎంపీడీవో టీ లక్ష్మీనారా యణ, వీఆర్వో ఈశ్వర్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ అవినాష్, ఏఎన్ఎం రాధమ్మ పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలకు రూ.12.27 కోట్లు మంజూరు

**విశాలాంధ్ర-గుమ్మగట్ట :** మండల పరిధిలోని గోనభావి గ్రామ సమీపంలో గల మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలకు రూ.12.27 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు బుధవారం ఉదయం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. 2016లో అప్పటి తమ ప్రభుత్వం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలికల పాఠశాలను మంజూరు చేయగా 2017లో రూ.24 కోట్ల అంచనా వ్యయంతో మొదట విడతగా రూ.11.73 కోట్లు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టామని, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని అన్నారు. మంత్రి సవిత ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడంలో బీసీ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ మూడు రోజుల క్రితం రెండవ విడతగా రూ.12.27 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులను త్వరలో ప్రారంభిస్తామని గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల తాజా అంచనా వ్యయం రూ.35.73 కోట్లకు చేరనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బండి కృష్ణమూర్తి సీనియర్ నాయకులు పసుపులేటి నాగరాజు,టంకశాల హనుమంతు పాల్గొన్నారు.

## విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర-యాడికి :** మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం టిడిపి మండల అధ్యక్షులు దడియాల ఆదినారాయణ, జనసేన మండల అధ్యక్షులు కోడి సునీల్ కుమార్ సింగిల్ విండో అధ్యక్షులు నాగ ముని రెడ్డి, మండల తెలుగు యువత నాయకులు తాంద్ర విక్రమ్ బిజెపి మండల అధ్యక్షులు వద్ది రాజశేఖర్ జనసేన మండల ఉపాధ్యక్షులు జాకీర్ హుస్సేన్ విశాలాంధ్ర విలేఖరి మహమ్మద్ ఫరూక్ చేతుల మీదుగా 2026 విశాలాంధ్ర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దడియాల ఆదినారాయణ, కోడి సునీల్ కుమార్, నాగ మునిరెడ్డి మాట్లాడుతూ జాతీయ తెలుగు దినపత్రిక 74 సంవత్సరాల నుండి నిరుపేద బడుగు బలహీన ప్రజా పక్షాన నిలుస్తూ ప్రజలకు అధికారులకు మధ్య వారధిగా పనిచేస్తోందని.. విశాలాంధ్ర దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతూ అంచెలంచెలుగా ఎదగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షులు తిరంపురం నీలకంఠ, టిడిపి యూత్ నాయకులు బోయరెడ్డిపల్లి హరి, స్టోర్ డీలర్ చంద గాని ఆదినారాయణ ఫీల్డ్ అసిస్టెంట్లు పెద్దయ్య, నరేంద్రబాబు, రమేష్ నాయుడు షరీఫ్, గన్నె శివ, డీలర్లు హాజీపీరా, మహమ్మద్ రఫీ ఖాదర్ వలీ, బీజేపీ యుగంధర్ పాల్గొన్నారు.

# నిధులు కాజేసిన వారిపై చర్యలు : ఎమ్మెల్యే సురేంద్రబాబు

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం:** గత ప్రభుత్వానికి భిన్నంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రస్తుతం పంచాయతీలకు నిధులు విడుదలవుతున్నాయని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. అయితే వైసీపీ సానుభూతిపర సర్పంచులతో కలిసి కొందరు పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారులు నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. అటువంటి వారిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కంబదూరు మండలం రాళ్లఅనంతపురం గ్రామంలో నిర్వహించిన ఉత్తమ కార్యకర్తల ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, సీనియర్ నాయకులు చౌలం మల్లికార్జున, మండల పార్టీ అధ్యక్షుడు శివన్న, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి రమేష్, మాజీ చైర్మన్ కర్లకుంట రామాంజనేయులు, తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ నాయకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇదే పంచాయతీలో సుమారు రూ.12 లక్షలు అక్రమంగా వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేసిన ఘటన వెలుగులోకి వచ్చిందని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ తక్షణ స్పందనతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారని ప్రశంసించారు. అలాగే ఆర్డీఓ వసంత బాబు, కంబదూరు ఎస్సై లోకేష్ ప్రజల పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు.

కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్లక్ష్యం వల్ల అనేక గ్రామాలకు బస్సు సౌకర్యం లేదన్న విషయాన్ని రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. గ్రామంలో రూ.3 కోట్ల వ్యయంతో తారు రోడ్డు పనులు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని, రెండు కమ్యూనిటీ భవనాలు కూడా నిర్మిస్తామని వెల్లడించారు. ఎన్నికల హామీ మేరకు బీటీపీ కాలువ పనులు ప్రారంభించామని, రోజుకు సుమారు కోటి రూపాయల వ్యయం అవుతోందన్నారు. గత ఐదేళ్ల రైతు పరిహారానికి సంబంధించిన మరో రూ.25 కోట్లు రైతులకు విడుదల కానున్నాయని తెలిపారు. మసీదును సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకు హామీ ఇచ్చారు. అక్కడే మాజీ సర్పంచ్ ఇమామ్ సాబ్ కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరారు. అలాగే ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్యే పంపిణీ చేయగా, ఉపాధ్యాయులు ఆయనను జ్ఞాపికతో సన్మానించారు.

## మార్కెట్ కమిటీ అభివృద్ధే ధ్యేయం

**విశాలాంధ్ర-శింగనమల:** శింగనమలం వ్యవసాయ మార్కెట్ కమిటీ సాధారణ కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి శింగనమల మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు మార్కెట్ కమిటీ అభివృద్ధి గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమమంలో జిల్లా ఏడిఎం,మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ ,మార్కెట్ కమిటీ అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండు శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయం మార్కెట్ అభివృద్ధి ధ్యేయంగా అందరం కలిసి పని చేయాలన్నారు. ఐకమత్యంతో ఏ పని నైనా సాధించుకోవచ్చని సూచించారు.

## ఉత్తమ సేవలకు సీఐకు పురస్కారం

**విశాలాంధ్ర-తాడిపత్రి :** ఎస్పీ జగదీష్ నుండి రూరల్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి ప్రశంసాపత్రం అందుకున్నట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఇతర పోలీస్ స్టేషన్లతో పోలిస్తే తాడిపత్రి రూరల్ యూపీఎస్‌లో లోక్ అదాలత్ కేసులను అత్యధికంగా పూర్తి చేసినందుకు ఎస్పీ తనకు, కోర్టు కానిస్టేబుల్ లక్ష్మిరెడ్డికి ప్రశంసా పత్రాలు అందజేశారని ఆయన తెలిపారు.

## ఏఐ ఆధారిత ఎంఆర్ఐ స్కాన్ ప్రారంభం

### ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిమ్స్ సవీర హాస్పిటల్ సేవలు

**విశాలాంధ్ర-అనంతపురం టౌన్:** కిమ్స్ సవీర హాస్పిటల్ ఎప్పటికప్పుడు ఆధునిక వైద్య సేవలు అందించడంలో ముందుంటుందని జిల్లా వైద్యాధికారి డా. ఈ.బి. దేవి అన్నారు. బుధవారం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఏఐ పవర్డ్ ఎంఆర్ఐ స్కాన్‌ను ఆమె అధికారికంగా ప్రారంభించారు. డా.ఈ.బి.దేవి మాట్లాడుతూ... వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడంలో ఈఏఐ ఎంఆర్ఐ స్కాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సిస్టమ్ ద్వారా మరింత స్పష్టమైన, అధిక క్లారిటీ కలిగిన ఇమేజెస్ లభిస్తాయని, దీంతో వ్యాధి నిర్ధారణ సులభతరం అవుతుందని వివరించారు. అనంతపురం-హిందుపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ టి.సి. వరుణ్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత ఆధునిక వైద్య సాంకేతికత అనంతపురం జిల్లాకు రావడం గర్వించదగిన విషయమని అన్నారు. అనంతరం రేడియాలజీ విభాగానికి చెందిన వైద్యులు డా.వి.వి. శ్రీకృష్ణ డా.వై.మధుమాధవ్, డా.టి.హరీష్, డా.సి.దీపా మాట్లాడుతూ ఈ 1.5 టెస్లా ఎంఆర్ఐ సిస్టమ్ 60 సెం.మీ ఫ్లేర్డ్ బోర్‌తో రూపొందించబడిందని ఇది రోగులకు అధిక సౌకర్యాన్ని అందించడంతో పాటు, తక్కువ సమయంలో ఎక్కువ స్కాన్లు నిర్వహించే సామర్థ్యం కలిగి ఉందన్నారు. కార్యక్రమంలో కిమ్స్ సవీర హాస్పిటల్ ఎండీ ఎస్.వి. కిషోర్‌రెడ్డి, సీఈఓ పి.ఎస్.ప్రసాద్, సీఓఓ సిద్ధారెడ్డి, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

## ఎంపీపీ ఎన్నికలపై ప్రత్యేకాధికారి సమీక్ష

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్ :** బొమ్మనహాళ్ ఎంపీపీ ఎన్నిక ఈనెల 5న జరుగుతున్న నేపథ్యంలో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రత్యేకాధికారి గంగధర బుధవారం ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ రమణ, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఎన్నికల నోటిఫికేషన్ అంశాలను వివరించారు. ఎంపీపీ ఎన్నికలకు తప్పని సరిగా హాజరు కావాలని ఎంపీటీసీ సభ్యులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎంపీపీ పద్మ రాజీనామా చేయడంతో ఎంపీపీ స్థానం భర్తీకి రాష్ట్ర ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియను నిబంధనలు ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తామని ప్రత్యేకాధికారి తెలిపారు. ప్రశాంత ఎన్నికకు అందరూ సహకారించాలని కోరారు.

## ఐచర్ గడ్డి లారీ దగ్ధం..

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్:** మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం పశుగ్రాసాన్ని లోడ్ చేసుకుని వెళ్తున్న ఐచర్ వాహనానికి విద్యుత్ వైర్లు తగిలి పశుగ్రాసం పూర్తిగా దగ్ధం అయ్యింది. రాయదుర్గం మండలం యర్రంపల్లి గ్రామానికి చెందిన రమేష్ 8 ఎకరాల భూమి పశుగ్రాసం కొనుగోలు చేసి ఐచర్ వాహనంలో లోడు చేసుకోని వెళ్తుండగా గడ్డిలోడు ఎత్తుగా పెట్టడంతో విద్యుత్ వైర్లు తగిలి షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగినట్లు తెలిపారు స్థానికులు వెంటనే మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి క్షణాల్లోనే గడ్డి మొత్తం కాలిపోయింది. రాయదుర్గం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది మంటలు అదుపు చేశారు. ఐచర్ వాహనం కొంతవరకు కాలింది. లారీలో ఉన్న డ్రైవర్ రమాంజి, హమాలీలు వెంటనే బయటకు దూకడంతో ప్రాణాపాయం తప్పింది. గడ్డి నష్టం రూ.25వేలు, ఐచర్ నష్టం రూ.లక్ష వరకు నష్టం జరిగిందని తెలిపారు.

## తూకాల్లో మోసాలు చేస్తే ఊరుకోం

**విశాలాంధ్ర-విడపనకల్లు:** మండల కేంద్రంలోని బేకరీలు, కిరాణా దుకాణాలను లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వై.జి. శంకర్ తనిఖీ చేశారు. బెంగళూరు బేకరికి రూ.15 వేలు, వేంకటేశ్వర బేకరికి రూ.7 వేలు, మహాదేవ్ కిరాణా షాపుకి రూ.5 వేల జరిమానాలు విధించి మరోసారి నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ప్రతి వ్యాపారి తమ తూకం యంత్రాలను ఏడాదికి ఒకసారి ప్రభుత్వ అధికారుల ద్వారా తనిఖీ చేయించుకుని సర్టిఫికేట్ పొందాలని, తూకాల్లో తేడా ఉన్నట్లు గమనిస్తే వినియోగదారులు వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అధికారులు స్పష్టం చేశారు.

## ఒక్కరోజు ముందుగా పెన్షన్ల పంపిణీ

**విశాలాంధ్ర-కణేకల్లు:** మండలంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పెన్షన్లు ఒక రోజు ముందుగానే పంపిణీ చేసినట్లు లాలెప్ప, ఆనంద్ రాజులు తెలిపారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి చెరువు సంఘం అధ్యక్షులు బిటీ, రమేష్, కార్యకర్తలు ఫస్ట్ వార్డ్ అల్తాఫ్ సచివాలయం సిబ్బంది కలిసి పెన్షనర్లను పంపిణీ చేశారు. హనుమాపురం గ్రామంలో ప్రెసిడెంట్ జయ రామ చౌదరి ఆధ్వర్యంలో పెన్షన్ పంపిణీ చేశారు, ఆంగ్ల సంవత్సరం ఆనందంగా ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి హామీ ఏపీఓపై ఫిర్యాదు

**విశాలాంధ్ర-డి.హీరేహాళ్ :** మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న సంజీవ్ కుమార్ పనితీరు బాగాలేదని వెంటనే ఈయనను మండలం నుంచి బదిలీ చేయాలని పీడీ సలీం భాషకు మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతురెడ్డి ఆధ్వర్యంలో ఎంపీటీసీ మల్లికార్జున, మురడి ఎంపీటీసీ తలారి గంగాధర ఫిర్యాదు చేశారు.

## గుత్తి కోటలో సినీ దర్శకులు, నటులు

**విశాలాంధ్ర-గుత్తి:** పట్టణంలో ప్రాచీన కోట వెలుపల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి నిప్రముఖ సినీ దర్శకులు వీర శంకర్, నటులు మధు బుధవారం దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి రోజున స్వామిని సందర్శించుకోవడం తమ అద ృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న సభ్యులను అభినందించారు. అదేవిధంగా గుత్తి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు మాకం శ్రీకాంత్ మధుసూదన్ రెడ్డి, ఆయన సోదరులు చంద్రశేఖర్ రెడ్డిలను అభినందించారు. గుత్తి ప్రాంతంలో తన తండ్రి డాక్టర్ శివరామిరెడ్డి సేవలను గుర్తు చేసుకున్నారు. ముక్కోటి గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ గుత్తి కోటలో సినిమా తీయాలని దర్శకులు వీరశంకర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రామాంజనేయులు, విజయ్ పాల్గొన్నారు.

## అనధికార పైప్‌లైన్లు వేస్తే చర్యలు..

**విశాలాంధ్ర-కణేకల్లు :** గ్రామ సచివాలయ పంచాయతీ అధికారులకు తెలియజేయకుండా పనులు నిర్వహించుకుంటే చర్యలు తప్పవని ఈఓఆర్డీ చంద్రమౌళి హెచ్చరించారు. బ్రహ్మసముద్రం గ్రామ పాతూరులో ఇష్టానుసారంగా వేస్తున్న పైప్‌లైన్లను బుధవారం పరిశీలించారు. కొందరు ఇంటి వారు ఎవరి ఇష్టానుసారం తమ ఇళ్ళ ముందు తవ్వడం చేయడం ద్వారా గొడవలు జరుగు తున్నట్లు తెలుసుకున్నారు. దీనిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ అధికారులు సంప్రదించి సమస్యలను తెలిపితే ఎస్టిమేషన్ ఇంజనీర్ ద్వారా మీకు కావాల్సిన పైపులైన్ సంబంధించి అందరి మద్దతుతో ఏ సమస్య రాకుండా పనులు చేపడతామని గ్రామస్తులకు తెలిపారు. ఎవరి ఇష్టం వచ్చినట్లు పనులు చేసుకుంటాం మాకు ఏ అధికారులతో అవసరం లేదు అనే వారిపైన చట్ట పరిధిలో చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## అనంతపురంలో పింఛన్ల పంపిణీ

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం :** దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీ జరుగుతోందని కడప రీజియన్ ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ పూల నాగరాజు, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వారు పలు కాలనీల్లో పర్యటిస్తూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు పంపిణీ చేశారు. 3,1,17వ డివిజన్లు, రుద్రంపేట పంచాయతీలోని చైతన్య నగర్ కాలనీలో ప్రతి ఇంటి వద్దకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పింఛన్లు అందజేశారు. ఒక రోజు ముందుగానే ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించడంపై లబ్ధిదారులు ఎంతో హర్షం వ్యక్తం చేశారు. జనవరి 1వ తేదీన సెలవు రోజు కావడంతో 31వ తేదీనే పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఒక అనంతపురం పార్లమెంట్‌లోనే రూ.120 కోట పింఛన్లు, అర్బన్ నియోజకవర్గంలో 11 కోట్ల రూపాయలు పింఛన్లు ఇస్తున్నట్లు చెప్పారు. తల్లికి వందనం పథకం కింద పదివేల కోట్ల రూపాయలు ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ అందజేసినట్లు తెలిపారు. నగరంలో రూ.130 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు

## విలేకరికి రూ.10 వేల సాయం

**విశాలాంధ్ర-శెట్టూరు :** కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పాత్రికేయుడు రాజన్నకు గత కొద్ది రోజుల క్రితం ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంలో కిందపడి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. బెంగళూరులో చికిత్సలు పొందిన అనంతరం స్వగ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న కంబదూరు ఎస్సై లోకేష్, బుధవారం రాజన్న కుటుంబ సభ్యులను పరామర్శించి మానవత్వంతో రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశాడు. ధైర్యంగా ఉండాలని ఏదైనా అవసరమైతే మళ్లీ సాయం చేయడానికి ముందు ఉంటానని భరోసా కల్పించారు. ఈ మేరకు ఎస్సై లోకేష్‌కు రాజన్న కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు..
శుభాకాంక్షలు

డి.నిర్మలమ్మ గారు
మేజర్‌గ్రామ పంచాయతీ సర్పంచ్,కనేకల్
కనేకల్ పట్టణ ప్రజలందరికి 2026 నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు..

చంద్ర మౌళి గారు
మేజర్‌గ్రామ పంచాయతి సెక్రటరీ (ఇంచార్జ్)
కనేకల్ మండలం

# నిబద్ధతతో కూటమి ప్రభుత్వ పాలన : మంత్రి సవిత

**విశాలాంధ్ర-పరిగి :** మా ప్రభుత్వంలో నిబద్ధతతో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు పాలనపై ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, కానీ జగన్, ఆయన పార్టీ నాయకులు మాత్రం విషం కక్కుతున్నారని మండిపడ్డారు. రప్పా...రప్పా... అంటూ రాష్ట్ర ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారి బెదిరింపులకు భయపడే వారెవరూ లేరని అన్నారు. దౌర్జనాలు, బెదిరింపులకు పాల్పడేవారిపై చట్టం తన పని తాను చేసుకుంటూ పోతోందని స్పష్టంచేశారు. పరిగి మండలం మోదా పంచాయతీలో బుధవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్లను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆమె స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఠంఛన్‌గా పెన్షన్లను పంపిణీ చేస్తున్నామన్నారు. గురువారం నూతన సంవత్సరం సంబరాలను ద ృష్టిలో పెట్టుకుని ముందురోజే బుధవారం పెన్షన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నేత ృత్వంలోని కూటమి ప్రభుత్వ నిబద్ధతకు పెన్షన్ల పంపిణీ ఓ నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 63.12 లక్షల మందికి రూ.2,743 కోట్లను సామాజిక పెన్షన్ల రూపంలో అందజేస్తున్నామని చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లాలో 2.63 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.115.51 కోట్లు, పరిగి మండలం మోదా పంచాయతీలో 1289 మందికి రూ.56 లక్షలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రతి హామీని, సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేశామని వివరించారు.

# విద్యా సమస్యలు పరిష్కరించాలని పోరాడితే రౌడీ షీట్లు ఓపెన్ చేస్తారా..

## ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర

**విశాలాంధ్ర-కదిరి టౌన్:** విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అడిగితే విద్యార్థి సంఘాల నాయకులపై కేసులు పెట్టి రౌడీ షీట్ ఓపెన్ చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర పేర్కొన్నారు. విద్యార్థి, యువజన ఉద్యమాలను అణచివేయడానికి ప్రభుత్వం కంకణం కట్టుకుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై విశాఖ పట్నంలో రౌడీషీట్ ఓపెన్ చేయడాన్ని ఖండిస్తూ కదిరి ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులపైన ఉద్యమాలకు సంబంధించిన పాత కేసులు తోడి నేడు విశాఖపట్నంలో ఐదు మంది విద్యార్థి యువజన నాయకులపైన ఓపెన్ చేసిన రౌడీషీట్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రితో సహా చాలామంది పైన పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయి. వాటి ఆధారంగా వారి పైన రౌడీషీట్ ఓపెన్ చేస్తారా బిజి అంటూ ఆయన ప్రశ్నించారు.. విద్యార్థులకు, గత రెండు సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వం బైజు సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆందోళన చేసిన నాయకుల పైన అప్పటి ప్రభుత్వం కేసు పెట్టారన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అక్రమ కేసులు తొలగిస్తామని అనేక సభలలో, సమావేశాలలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఎన్నికల సమయంలో విద్యార్థులకు యువజనలకు ఉపాధ్యాయులకు కార్మికులకు ఉద్యమాలు చేస్తున్న అనేక సంఘాలకు హామీలు ఇచ్చారు. అయితే రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని ఒక హిట్లర్ పరిపాలనను తలపిస్తూ రౌడీ షీట్లు, పీడీ యాక్టు ఓపెన్ చేసి ఉద్యమాలను అణిచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని మండిపడ్డారు, ఏఐఎస్ఎఫ్ , ఏఐవైఎఫ్ నాయకులపైన పెట్టిన రౌడీషీట్ ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద పోరాటాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు విఘ్నేష్, కుళ్ళాయి, అఖిల్, మెహర్, కార్తీక్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

# రౌడీ షీట్‌లను తొలగించాలి

## హిందూపురంలో ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్ నాయకుల నిరసన

**విశాలాంధ్ర - హిందూపురం :** విశాఖపట్నంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపైన ఓపెన్ చేసిన రౌడీ షీట్‌ను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ, విద్యారంగ సమస్యలపై పోరాడుతున్నటువంటి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం రౌడీ షీట్ ఓపెన్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నామని, రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు ఉద్యమాలు చేపడుతున్నారన్న ఉద్దేశంతో, మంగళవారంన విశాఖపట్నంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకుల పై అక్రమంగా రౌడీ షీటర్ ను ఓపెన్ చేస్తున్నారని, మీరు ఎన్ని కేసులు పెట్టిననూ, ఎంతమంది మీద రౌడీషీటర్ ఓపెన్ చేసిననూ ఏఐఎస్ఎఫ్ నాయకత్వం వెనకడుగు వేసేదే లేదన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలి.. ఎస్పీ

**విశాలాంధ్ర-రొద్దం:** సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు, రికార్డులను పరిశీలించి మండలంలో అసాంఘిక కార్యకలాపాల గురించి ఎస్సై వీరాంజనేయులతో చర్చించారు. అసాంఘిక కార్యక్రమాలపై ఇసుక అక్రమ రవాణా పేకాట, అక్రమ మద్యం, రౌడీ షీటర్స్ తదితర విషయాలపై కఠినంగా వ్యవహరించాలని ఎంతటి వారైనా కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు సూచనలు సలహాలు అందించారు, ఈ సందర్భంగా పెనుకొండ డివిజన్ పోలీస్ అధికారి యు.నర్సింగప్ప, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవన్ పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్..

**విశాలాంధ్ర-గాండ్లపెంట:** మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రౌడీషీటర్లను బుధవారం పిలిపించి ఎస్ఐ బి.సుమతి కౌన్సిలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఏవైనా గొడవలు లేదా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను స్థానిక తహసిల్దార్ బాబురావు ఎదుట బాండ్‌పై సంతకాలు చేయించారు. ఈ కార్యక్రమంలో జమీందార్ గంగాధర, నరసింహులు, భాష పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులు పాటించాలి

**విశాలాంధ్ర-నల్లచెరువు :** మండలంలోని పి.కొత్తపల్లి, నల్లచెరువు గ్రామాలలో బుధవారం మండల వ్యవసాయం అధికారిణి బి.లక్ష్మిప్రియా ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి నిర్వహించారు. వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ భాగంగా వేరుశనగ, కంది మొక్క జొన్న పంటలను పరిశీలించి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై క్లుప్తంగా వివరించారు. వేరుశనగ పంటలో విత్తన శుద్ధి, పంటకు ఆశించే పేనుబంక, పచ్చదోమ, తామర పురుగుల నివారణకు క్లోరైరిఫోస్ మందును 4 ఎంఎల్ ఒక్క లీటర్ నీటికి, వేప నూనె 1 లీటర్ కలిపి పిచ్చుకరి చేయాలి. ఆకు ముడత పురుగు నివారణకు నోవాలియరాన్ 2 ఎంఎల్ 1 లీటర్ కలిపి పిచికారి చేసుకోవాలని, కందిలో మారుక మచ్చ పురుగు, ఆకు చుట్టు పురుగు, కాయతొలుచు పురుగు నివారణకు ఇమామేక్టిన్ బెంజాస్తే 2 ఎంఎల్ రబి 2025 సవంత్సరానికు సంబంధించిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలని చెప్పారు.

## సంతకు స్థలం లేక అగచాట్లు

**విశాలాంధ్ర-అమరాపురం:** అమరాపురంలో ప్రతి శుక్రవారం సంత నిర్వహణకు తగిన స్థలం చూపించాలన్న డిమాండ్ నెలలుగా పెండింగ్‌లోనే ఉందని వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విన్నపాలు చేసినా, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని ఆరోపిస్తున్నారు. స్పష్టమైన సంత స్థలం లేకపోవడంతో రహదారులపై గుంపులు, ట్రాఫిక్ జామ్‌లు, పార్కింగ్ సమస్యలు తీవ్రంగా పెరిగాయని తెలిపారు. పౌరుల సమస్యలను పరిష్కరించడం పంచాయతీ బాధ్యత కాదా? అని ప్రశ్నిస్తున్నారు. స్థానిక సర్పంచ్ అధికారులు తక్షణం సంతకు శాశ్వత స్థలం చూపించాలని లేనియెడల అధికారులపై వేలం పాడిన నాయకులు, వ్యాపారస్తులు తమ నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

## అబాకస్ పోటీల్లో ప్రతిభ..

**విశాలాంధ్ర-కదిరి టౌన్ :** ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న తేజేష్ జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్ కిరణ్ తెలిపారు. బుధవారం పాఠశాలలో సభ ఏర్పాటు చేసి విద్యార్థిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 28న హిందూపురంలో జిల్లా స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తేజేష్ కేవలం 5 నిమిషాల్లో 49 ప్రాబ్లమ్స్ చేసి ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు వివరించారు. ఫిబ్రవరిలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తేజేష్ పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థితో పాటు అబాకస్ శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు అంజలిని ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి

### డీఎల్‌డీవో వెంకటరత్నం

**విశాలాంధ్ర-నంబులపూలకుంట :** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మండల అభివృద్ధి సాధ్యమవుతుందని డీఎల్‌డీవో వెంకటరత్నం అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భూ రీసర్వే, స్వామిత్వ, ఐవీఆర్ఎస్ వంటి సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని, పంచాయతీల అభివృద్ధికి నిధులు సమకూర్చడంతో పాటు ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రతి గ్రామాన్ని చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దేవేంద్ర నాయక్, ఎంపీడీవో పార్థసారధి, డిప్యూటీ ఎంపీడీవోలు మాధవరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న సందా రాఘవ

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని శారదనగర్‌కు చెందిన రామాంజనేయులు వయస్సు రీత్యా ఆరోగ్య సమస్యలతో మృతి చెందడం జరిగింది. అంత్యక్రియలు చేయడానికి కొడుకులు కూడా ఎవరూ లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్న భార్య తులసమ్మ తారక్ చేయూత ట్రస్ట్‌కు తెలిపింది. దీంతో తారక్ ట్రస్ట్ అధ్యక్షులు రామాంజి ప్రముఖ చేనేత నాయకులు, టిడిపి నాయకుడు సందా రాఘవాకు సమాచారాన్ని అందజేయగా వెనువెంటనే రూ.10 వేలు అంత్యక్రియలకు నిమిత్తం అందించి మరోసారి వారు మానవతను చాటుకున్నారు. తారక్ చేయూత ట్రస్ట్ వారు దాతకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# అన్ని చెరువులను కృష్ణా జలాలతో నింపుతాం ..

## ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**విశాలాంధ్ర-కొత్తచెరువు :** ఎడారి ప్రాంతమైన రాయలసీమ ప్రాంతానికి పూర్తిగా జలకళ రావడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృషితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు మండలం బండ్లపల్లి పంచాయతీలోని, నారాయణపురం అప్పలవాండపల్లి, గౌనుగుంటపల్లి, గ్రామాలలో ఆమె ఎమ్మెల్యే వృద్ధులకు వితంతు వికలాంగులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం లో జనవరి 1 తేదీ కంటే ఒకరోజు ముందుగానే డిసెంబర్ 31న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ తో గ్రామాల్లో ఉన్న ప్రజలకు నూతన సంవత్సర 2026 వేడుకలు ప్రారంభమయ్యాయనీ తెలిపారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంతాల్లో నీటి కళ వచ్చిందన్నారు. ఈ ఐదేళ్లలో కూటమి ప్రభుత్వంలో నియోజవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలతో నింపుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులాలకు మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సమాన స్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన రాష్ట్రాలు ఏవీ లేవని ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు అవుతున్నాయని తెలిపారు.

# పేదల పెన్నిధి కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే కందికుంట

విశాలాంధ్ర-కదిరి: పేదల పెన్నిధి కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మున్సిపల్ చైర్మన్ దిల్షాదున్నిసా తో కలిసి ఎన్ టి ఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అవ్వ తాతల ముఖంలో చిరునవ్వు చూడాలనే సంకల్పంతో ప్రతి నెల 1న పేదలకు తోడుగా నేను ఉన్నానంటూ ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారని తెలిపారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు పూర్తిగా నెరవేర్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం జనరంజక పాలన

### ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాముడు

**విశాలాంధ్ర-పెనుకొండ:** కూటమి ప్రభుత్వం 2025 సంవత్సరంలో జన రంజక పరిపాలన కొనసాగించిందని ఉప్పర సగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాముడు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము అధికారం చేపట్టిన 18 నెలల కాలంలో చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు సూపర్‌సిక్స్ పథకాల సూపర్ హిట్ అయ్యాయని, తల్లికి వందనం పథకానికి రూ.10,090 కోట్లు చెల్లింపు, స్త్రీ శక్తి ఆగస్ట్ 15 నుంచి పథకం ప్రారంభం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇప్పటి వరకు 3.25 కోట్ల ప్రయాణాలు. ఇప్పటి వరకు ఈ పథకానికి రూ.1,144 కోట్ల వ్యయం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ 46 లక్షల మంది రైతులకు... రూ.6,310 కోట్లు రైతులకు లబ్ధ దీపం 2 ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు, రూ.2,684 కోట్లు, ఇప్పటికి దాదాపు 2 కోట్ల సిలిండర్ల పంపిణీ ఎన్టీఆర్ భరోసా ఇప్పటివరకు రూ.50,000 కోట్లకు పైగా పెన్షన్ల కోసం వ్యయం... ఏడాదిలో రూ.33,000 కోట్లు పంపిణీ, నెలకు రూ.2,750 కోట్లు

మత్స్యకార భరోసా... ఏడాదికి 20 వేల చొప్పున 1.25 లక్షల మందికి రూ.250 కోట్లు నేతన్నలకు ఉచిత విద్యుత్ : మర మగ్గాలకు నెలకు 500 యూనిట్లు, మగ్గాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

ఆటో డ్రైవర్ల సేవలో ఏడాదికి రూ.15,000... రూ.436 కోట్లు జమ, 2.90 లక్షల మందికి లబ్ధి, 204 అన్నా క్యాంటిన్లు. ఇప్పటి వరకు 4 కోట్ల భోజనాలు మైనారిటీ సంక్షేమానికి రూ.3,670 కోట్లు వ్యయం. 15.8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5,000 చొప్పున గౌరవ వేతనం రూ.51 కోట్లు ఇమామ్లకు నెలకు రూ.10,000 మౌజన్లకు రూ.5,000 చొప్పున ఏడాదికి రూ.90 కోట్లు, పురోహితులకు నెలకు రూ.15,000కు వేతనాల పెంపు నాయీ బ్రాహ్మణులకు నెలకు రూ.25,000కు వేతనాల పెంపు రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు. మరో రూ.3,000 కోట్లతో రహదారుల నిర్మాణం చేశామని కూటమి ప్రభుత్వము సంక్షేమంలోనూ అభివ ృద్ధిలోనూ పరుగులు పెడుతోందని తెలిపారు మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో నియోజకవర్గ ప్రగతి బాట పరిగెడుతోందని తెలిపారు ఆయనతో పాటుగా కన్వీనర్ శ్రీరామ్ యాదవ్, వడ్డే నాగప్ప ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

**విశాలాంధ్ర-పుట్టపర్తి :** పేదల బతుకులు వెలుగులు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సింధూరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయి అరామంలో ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు రాజీవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే 250 మంది నిరుపేద మహిళలకు ఉచితంగా సిలిండర్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పొగ చూరిన బతుకుల్లో వెలుగులు నింపేందుకే ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను అందిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పొడవునా ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. కార్యక్రమంలో డిఎస్‌ఓ వంశీకృష్ణా?రెడ్డి, తాసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, సింధు, మున్సిపల్ మేనేజర్ పద్మావతి, ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ నిర్వాకులు రాజీవ్ పాల్గొన్నారు.

## పౌష్టిక ఆహారం పంపిణీ..

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం కోడిగుడ్లు వంటనూనె చిక్కిళ్ళు, పౌష్టికి ఆహారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తిపేంద్ర నాయక్ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తిపేంద్ర నాయక్, డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి ప్రస్తుతం మందులు మింగుతున్న వారికి సంగో కంపెనీ, ఏపీ అండ్ పి ప్రాంతం గ్యాస్ ఏజెన్సీ వారి తరఫున ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో టిబి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, జిల్లా పిపిఎం కోఆర్డినేటర్ నాగేంద్ర, టిబి సూపర్వైజర్ క్రిష్టప్ప, చంద్రకళ, సావిత్రి పాల్గొన్నారు.

## ఉద్యోగికి పదవీ విరమణ సాధారణం

**విశాలాంధ్ర-గుడిబండ:** ఉద్యోగికి పదవీ విరమణ సర్వసాధారణమని, శేష జీవితం ఆనందంగా గడపాలని డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మహిళ సమైక్య మండలి భవనంలో గుడిబండ ఏపీఎం తిప్పన్న పదవి విరమణ కార్యక్రమంలో డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ నరసయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ 35 సంవత్సరాల విధినిర్వహణలో అంకితభావంతో పని చేసి పదవీ విరమణ చేయడం గొప్ప విషయమన్నారు.. ఉద్యోగులు పనిచేస్తున్న సమయంలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని తెలిపారు. ఏపీఎం తిప్పన్న దంపతులను శాలువా పూలహారలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్డిఏ వెలుగు ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఎస్.నరసయ్య, డి పిఎంఎల్ హెచ్ రామ్మోహన్, డీపీఎంలు సత్యనారాయణ, రామ్‌రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య, ఏపీవో జగదీష్, రొళ్ల ఏపీఎం ఎస్.ఆర్. నాగరాజు, ఏపీఓ జగదీష్, ఎఫ్‌పిఓ దేవరాజు, సీసీలు అకౌంటెంట్లు వెలుగు మహిళ మండల సమైక్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 2025 వైబ్రెంట్ ఉత్కర్ష్ వేడుకలు

**విశాలాంధ్ర-గోరంట్ల :** మండలంలోని బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో బుధవారం బీటెక్ బ్యాచ్ విద్యార్థుల రెండు రోజుల స్వాగత వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2025 వైబ్రెంట్ ఉత్కర్ష ఫ్రెషర్స్ ఈవెంట్ కార్యక్రమాల సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ అప్లైడ్ టెక్నాలజీ (సీట్) తన బీటెక్ కొత్త బ్యాచ్ రెండు రోజుల కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాల నిర్వహించారు. విశ్వవిద్యాలయ అధికారులు మాట్లాడుతూ విద్యార్థుల స్నేహాన్ని పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని అన్నారు. క్రమశిక్షణతో పాటు విద్యార్థుల సమగ్రవృద్ధి ముఖ్యమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు క్రీడలు రాంప్ వాక్ పోటీల్లో పాల్గొన్న విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

## న్యాయం జరిగే వరకు పోరాడుతాం

### దళిత పోరాట హక్కుల సమితి అధ్యక్షులు

**విశాలాంధ్ర-తాడిమర్రి :** మండల పరిధిలోని పుల్లంపల్లి గ్రామంలో వారం రోజులు క్రితం దళితులపై దాడి జరిగిన విషయంపై శ్రీ సత్య సాయి జిల్లా దళితుల పోరాట హక్కుల సమితి అధ్యక్షులు సాకే రామకృష్ణయ్య తాడిమర్రి మండలం సిపిఐ మండల అధ్యక్షులు బికే లక్ష్మీనారాయణ, దళిత సంఘం నాయకులు బుధవారం రోజున పుల్లంపల్లి గ్రామ సందర్శించి క్షతగాత్రులను పరామర్శించడం జరిగింది. ఈ విషయంపై దళిత సంఘం నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడులు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని ఇలాంటి దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని దళిత సంఘం నాయకులు తెలిపారు ఈ కార్యక్రమంలో పోతలయ్య కిష్టయ్య పూజారి నరసింహులు అక్కిం నరసింహులు ఏసుదాసు లక్ష్మీనారాయణ ఓబుళపతి, రామకృష్ణ, తదితర నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వర్చువల్‌గా శుభారంభం

## -మంత్రి సత్య కుమార్ యాదవ్

**విశాలాంధ్ర-ముదిగుబ్బ** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనాన్ని, అలాగే మండలంలోని రామస్వామి తండా, గాండ్లవారిపల్లి, అడవిబ్రహ్మణపల్లి తండాల్లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ వెల్నెస్ సెంటర్లు, రాళ్లానంతపురం-కొడవండ్లపల్లి మధ్య నిర్మించిన కాజ్‌వే వంతెనను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ బుధవారం వర్చువల్ విధానంలో శుభారంభం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి గ్రామానికి వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ చేస్తాయని తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీవారి గరుడోత్సవం

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయంలో బుధవారం ఉదయం ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయంలో శ్రీవారి గరుడోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించామని ఆలయ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. గరుడ వాహనంలో స్వామివారిని వివిధ పూలమాలలతో అలంకరించిన తదుపరి వాహనంలో ఆశీనులు చేశారు. తదుపరి అర్చకులు కోనేరా చార్యులు, భాను ప్రకాష్, మకరంద బాబు, చక్రధర్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. దాతలైన కీర్తిశేషులు మోకా చిన్న వెంకటసుబ్బయ్య మనవడు ఎం. రాఘవేంద్ర రవితేజ హైదరాబాద్ వారి పేరిటన ప్రత్యేకంగా పూజలు నిర్వహించి ఘనంగా సత్కరించారు. పురవీధులలో స్వామివారిని అత్యంత వైభవంగా వేదమంత్రాలు మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. అన్నమయ్య సేవామండలి అధ్యక్షులు పొరాల్లపుల్లయ్య ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తనలు, చెన్నకేశవ స్వామి పాటలు అందరినీ ఆకట్టుకుంది.

## నేత్రదానంలో అపోహలకు తావివ్వరాదు

**విశాలాంధ్ర-ధర్మవరం:** నేత్రదానం చేయుటలో అపోహలకు తావు ఇవ్వరాదని ఆర్డిఓ మహేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని విశ్వదీప సేవా సంఘం వార్షికోత్సవం సేవా సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డీవో విచ్చేశారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ నేత్ర దానం చేస్తే వాటి వలన మరో తరం వారికి మనం ఆదర్శప్రాయులం అవుతామని తెలిపారు. వ్యవస్థాపకులు కోళ్ల మొరం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి సంవత్సరం ఎంతోమంది చూపు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాంటివారికి నేత్రదానం ద్వారా వారి జీవితాల్లో వెలుగు నింపిన వారం అవుతామని తెలిపారు. తదుపరి అధ్యక్షుడిగా గాజుల సురేష్, ఉపాధ్యక్షులుగా టీ. చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శిగా జూజారు రఘు, ఉప కార్యదర్శిగా ప్రభాకర్ రెడ్డి, కోశాధికారిగా ఆదినారాయణ, వీఆర్‌ఓగా ఖమ్మం మాధవ తదితర సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నేత్రదాతల కుటుంబ సభ్యులకు ఆర్డీవో సత్కారం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు మధు నాయుడు, వెంకటేష్, కేశవరెడ్డి, ఓబులయ్య, ఆక్కులప్ప, మనోహర్, ధనుంజయ, నాగ వెంకటరమణ, నాగేశం తదితరులు పాల్గొన్నారు.

## 95 శాతం పెన్షన్లు పంపిణీ ..

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని 40 వార్డులలో 17,951 మంది పెన్షనర్లు ఉండగా బుధవారం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఐదున్నర వరకు 17,076 మంది పెన్షన్ దారులకు పెన్షన్లను పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మికంగా పలుచోట్ల తనిఖీ చేశామని తెలిపారు. నేరుగా పెన్షన్ దారులతో మాట్లాడామని ఎవరికి ఎటువంటి లంచం ఇవ్వరాదన్న విషయాన్ని కూడా తెలియజేశామన్నారు. మిగిలిన వారికి జనవరి 2వ తేదీ లోపల ఇంటింటికీ వెళ్లి మా సిబ్బంది పెన్షన్లు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్‌ఓ.. భాస్కర్ రాయల్ పాల్గొన్నారు. అన్ని గ్రామ పంచాయితీలలో ఉదయం 5 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పెన్షన్ పంపిణీలో జిల్లాలో టాపర్ నిలచడం జరిగిందని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. రూరల్ పరిధిలో 6,729 మంది పింఛన్‌దారులు ఉండగా 6,345 మందికి పంపిణీ చేశామన్నారు. దీంతో 94.05 శాతం నమోదు కావడం జరిగిందన్నారు. రేగాటిపల్లి, తుమ్మల, సుబ్బారావుపేట గ్రామాలలో తాను తనిఖీ చేసి పింఛన్‌దారులతో నేరుగా మాట్లాడానని వెల్లడించారు.

## కౌన్సిలర్లకు సమాచారం ఎందుకివ్వరు?

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని 40 వార్డులలో అధికారులు చేపట్టే ప్రతి కార్యక్రమం కౌన్సిలర్లకు తెలియక పోవడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని వైసీపీ కౌన్సిలర్లు కమిషనర్ సాయి కృష్ణ ఇతర అధికారులపై ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలో కౌన్సిలర్ల సమావేశాన్ని చైర్పర్సన్ కాచర్ల లక్ష్మీ అధ్యక్షతన జరిగింది. సాయి ప్రకాష్ అజెండాలోని 41 అంశాలను చదివి వినిపించారు. తదుపరి కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్ ,కోఆప్షన్ నెంబర్ రామకృష్ణలు మాట్లాడుతూ పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పుడు జరుగుతున్నాయో? ఎప్పుడు జరగటం లేదో? ప్రజలు చెపితే తప్ప మాకు తెలియటం లేకపోవడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. రిజర్వుడ్ స్థలాల్లో మట్టిని కొంతమంది తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, గత సమావేశంలో చెప్పినా కూడా వాటికి పరిష్కారం చూపకపోవడంలో గుట్టు ఏంటి అని ప్రశ్నించారు. అదేవిధంగా మున్సిపల్ స్థలాలను కూడా కబ్జాలకు గురవుతున్నాయని కమిషనర్ దృష్టికి తెచ్చారు. అధికారులు చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు. వివిధ కార్యక్రమాలపై పెట్టిన ఖర్చుపై కౌన్సిలర్లు ఇంజనీరింగ్ ఇంజనీరింగ్ అధికారులను అడుగగా, అధికారులు సమాధానాలు చెప్పలేక ఊరుకుండుపోవడం పద్ధతి కాదు అని తెలిపారు. పట్టణంలో 12,000 మందికి పైగా లేఅవుట్లో ఇల్లు కట్టుకున్నారని వారికి చిరునామా లేకపోవడంతో బతకాలతో పాటు ఓటు తదితర హక్కులను కోల్పోయే ప్రమాదం ఉంది, వాటిపై వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. టౌన్ ప్లానింగ్ అధికారి అలివేలమ్మ మాట్లాడుతూ కోర్టు నుంచి తీర్పు వచ్చేదాకా తాము చర్యలు చేపట్టలేమని తెలిపారు. అ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ శంషాద్ బేగం, మున్సిపల్ మేనేజర్, మున్సిపల్ ఆర్ఐ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 01, జనవరి 2026

## ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రాలను ప్రారంభించిన మంత్రి సవిత

**విశాలాంధ్ర-పరిగి:** సిఎస్ఆర్ నిధులతో పూర్తీ చేసిన ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రాలను రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత , జౌళి శాఖల మంత్రి సవిత ప్రారంభించారు. మండలంలోని కోనాపురం, మోదా, బిందునగర్, ముల్లమోతుకపల్లి, పరిగి టౌన్, ఎస్.కొత్తపల్లి, నేతులపల్లి గ్రామాల్లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఎస్టేట్ బుల్ వారు సి ఎస్ ఆర్ నిధుల ద్వారా మొత్తం 30 లక్షల రూపాయల వ్యయంతో 7 వాటర్ ప్లాంట్లు నిర్మించారు.నేడు మోదా గ్రామం మరియు కోనాపురం గ్రామాల్లో ఈ శుద్ధజల కేంద్రాలను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు స్వఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఎస్టేట్ బుల్ ప్రతినిధులు సునీల్ శర్మ, ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతర కార్పొరేట్ సంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని మంత్రి సవిత పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ దీర్ఘకవితల పోటీల ఫలితాలు వెల్లడి

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం:** రాయలసీమ సాంస్కృతికోద్యమంలో భాగంగా నిర్వహించిన శ్రీ తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి స్మారక రాయలసీమ దీర్ఘకవితల పోటీల ఫలితాలను రాయలసీమ సాంస్కృతిక వేదిక సమన్వయకర్త డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డి మంగళవారం ప్రకటించారు. ఈ పోటీలకు రాయలసీమతో పాటు ఇతర ప్రాంతాల నుంచి 42 మంది కవులు దీర్ఘకవితలు పంపించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ విమర్శకులు సూర్యసాగర్, డా.అంకే శ్రీనివాస్లు వ్యవహరించారు. పోటీల్లో ప్రథమ బహుమతిగా "నాగేటి తడి" దీర్ఘకవితకు గాను తిరుపతికి చెందిన డా. నాగోలు కృష్ణారెడ్డికి రూ. 7,000లు, ద్వితీయ బహుమతిగా "గావుముద్ద" రచనకు కళ్యాణదుర్గానికి చెందిన గురువేపల్లి నరసింహులుకి రూ. 4,000లు, అందజేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే తృతీయ బహుమతులుగా "రేషం రైతు" రచించిన పెనుకొండకు చెందిన యాములపల్లి నరసిరెడ్డి, "శిల సజీవమైతే" రచించిన చిత్తూరుకు చెందిన భూక్యా గోపినాయక్లకు కలిపి రూ. 4,000లు, బహుమతిగా అందజేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను తిమ్మాపురం బాలకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, కార్యక్రమ సలహాదారులు తిమ్మాపురం ప్రకాశ్, మెట్టుపల్లె జయదేవ్ రెడ్డిలు అభినందించారు. రాయలసీమ సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో ఈ తరహా పోటీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## పింఛన్ల పంపిణీ పరిశీలించిన ఎంపీడీవో

**విశాలాంధ్ర - గాండ్లపెంట:** మండల వ్యాప్తంగా బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామకృష్ణ కటారుపల్లి, గాండ్లపెంట గ్రామాలలో పింఛన్ల పంపిణీ తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు పింఛన్లు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోహిత, ఎంపీపీ సోమశేఖర్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ప్రసాద్, దొనకొండ ఆనంద్, అక్రమ్, దాసిరెడ్డి, చిన్నోడు, సికిందర్‌తో పాటు ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ : ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి

**విశాలాంధ్ర - నల్లచెరువు:** మండల వ్యాప్తంగా బుధవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి నల్లచెరువు, రాట్నాలపల్లి గ్రామాల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## దీపిక సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**విశాలాంధ్ర-అమరాపురం:** నియోజకవర్గం డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి ప్రాతినిత్యం వహించినప్పటి నుంచి ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా జనవరి ఒకటో తారీఖున కాంగ్రెస్ పార్టీకార్యక్రమమునిర్వహించుకోవడం విధితమే. అందులో భాగంగానే నేడు నీలకంఠాపురం గ్రామంలో వెలసిన శ్రీనీలకంఠేశ్వర దేవాలయంలో జాతీయ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్ రఘువీరా రెడ్డి అందుబాటులో ఉంటారు. కావున మండలంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రఘువీర్ రెడ్డితో కలవవచ్చు అని మండల కన్వీనర్ గురుమూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. అంతేకాకుండా జనవరి ఒకటో తేదీన అంద మహిళల టి20 ప్రపంచ కప్ రథసారథి వహించిన టి సి దీపికకు ఘన సన్మానాన్ని సి డబ్ల్యూ సి మెంబర్ రఘువీరా రెడ్డి సమక్షంలో నీలకంఠాపురం గ్రామంలో ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. దీనిని విజయవంతం చేయాలని కార్యకర్తలకు నాయకులకు మండల కన్వీనర్ గురుమూర్తి తెలియజేశారు. ఈ సమయంలో కేంకేర శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు రాజప్ప, హనుమంతరాయప్ప, శివన్న తదితరులు ఉన్నారు.

## ముగిసిన లక్ష్మీ వెంకటేశ్వరుని మహోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణములోని శ్రీనివాస నగర్ లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో డిసెంబర్ 28వ తేదీ నుండి 31వ తేదీ వరకు నాలుగు రోజులపాటు అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వైకుంఠ ఏకాదశి తోపాటు ప్రత్యేక వేడుకలు ఆలయ అభివృద్ధి కమిటీ, చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ చెన్నం శెట్టి శ్రీనివాసులు, జింక రాజేంద్రప్రసాద్, చెన్నం శెట్టి రమేష్ కుమార్, భక్తాదులు, దాతుల నడుమ ఘనంగా నిర్వహించారు. డిసెంబర్ 28న కలశపూజ ,రక్షాబంధనం, 29న అమ్మవార్లకు స్వామివార్లకు కుంకుమార్చన, ముప్పయిన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారా ప్రవేశం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. చివరి రోజు బుధవారమున పూర్ణా?హుతి కలస ఉద్వాసన, ప్రత్యేక పూజలు అభిషేకాలు, హెూమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కూడా నిర్వహించడం జరిగిందని ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమాలను తిరిగించడానికి భక్తాదులు వందల సంఖ్యలో హాజరయ్యారు.

## గుత్తిలో అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు

**విశాలాంధ్ర-గుత్తి:** పట్టణం శాంతి ప్రియ హాస్పిటల్‌లో డాక్టర్ శాంతి ప్రియ ఆధ్వర్యం లో బుధవారం నిర్వహించిన ముందస్తు ఆంగ్ల నూతన సంవత్సర పురస్కరించుకొని వైసీపీ నాయకుల కలయిక కార్యక్రమం జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీబీ మంజునాథ్ రెడ్డి హాజరై కేక్ కటింగ్ చేసి అందరికీ ముందుగా నూతన శుభాకాంక్షలు తెలియజేసిన 2026 సంవత్సరంలో కూడా అందరూ పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంతో పాల్గొని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వైవిఆర్ ఆదేశించినట్లు అందర్నీ కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించి అందరికీ నూతన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుత్తి పట్టణ కన్వీనర్ మున్సిపల్ చైర్పర్సన్ వైస్ ఛైర్మన్ రాష్ట్ర జిల్లా నాయకులు ప్రజా ప్రతినిధులు పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాలు పాల్గొన్నారు.

## ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

**విశాలాంధ్ర-పరిగి :** మండల పరిధిలోని మోదా పంచాయతీ గ్రామంలో జలజీవన్ పథకంలో భాగంగా 36 లక్షల రూపాయల నిధులతో నిర్మాణం చేపట్టబోయే ఓవర్ హెడ్ ట్యాంక్‌కి బుధవారం భూమిపూజ చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత మంత్రి మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి సౌకర్యం కల్పించుటకు కూటమి ప్రభుత్వము అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌కి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాలలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణాలు జరుగుతున్నాయని ఇంకా కొన్ని గ్రామాలకు పనులు మంజూరు కావాల్సి ఉన్నదని మంత్రి తెలిపారు, మోద గ్రామం నందు ఇద్దరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి సవిత పంపిణీ చేశారు, గ్రామానికి చెందిన ఉస్మా బేగ్ కు 89,692, మంజునాథుకు 30 వేల రూపాయలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఫ్లిప్ కార్ట్ ఏజెంట్ల మోసం

# బార్బిక్యూ ఆర్డర్‌కు బదులు ప్లాస్టిక్ పెట్ట

**విశాలాంధ్ర-బొమ్మనహాల్:** మండల పరిధిలోని సింగనహళ్లి గ్రామానికి చెందిన భారతి పవన్ కుమార్ ఫ్లిప్ కార్ట్ ద్వారా ఆన్‌లైన్‌లో బార్బిక్యూ ఐటమ్‌ను ఆర్డర్ చేశారు. ఆర్డర్‌కు వారం గడిచినా సరైన సమాచారం ఇవ్వని డెలివరీ ఏజెంట్లు, రెండు రోజుల క్రితం ఫోన్ చేసి "మీ బార్బిక్యూ ఐటమ్ చాలా బరువుగా ఉంది, తీసుకురావడానికి కొంత సమయం పడుతుంది" అని చెప్పినట్లు బాధితుడు వెల్లడించారు. అయితే బుధవారం ఆర్డర్ డెలివరీ సమయంలో బార్బిక్యూ యంత్రం రావాల్సిన బాక్సులో కేవలం ప్లాస్టిక్ కూరగాయల పెట్టె మాత్రమే ఉండటంతో పవన్ కుమార్ అవాక్కయ్యారు. సుమారు 70 రూపాయల విలువ గల సాధారణ ప్లాస్టిక్ బాస్కెట్‌ను పంపించి, ఖరీదైన బార్బిక్యూ ఆర్డర్‌ను డెలివరీ చేయకపోవడం ద్వారా ఫ్లిప్కార్ట్ డెలివరీ ఏజెంట్లు మోసపూరితంగా వ్యవహరించారని ఆయన ఆరోపించారు. బాక్సు పూర్తిగా చిరిగిపోయిన స్థితిలో ఉండటం, లోపల ఉన్న వస్తువు పూర్తిగా భిన్నంగా ఉండటంతో ఇది కేవలం పొరపాటు కాదని, ఉద్దేశపూర్వక మోసమేనని బాధితుడు పేర్కొన్నారు. ఈ ఘటనతో తీవ్ర మానసిక వేదనకు గురైనట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై సంబంధిత శాఖలు వెంటనే స్పందించి, ఫ్లిప్కార్ట్ డెలివరీ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితుడికి పూర్తి న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఆన్‌లైన్ కొనుగోలుదారుల నమ్మకాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన నియంత్రణ చర్యలు అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సామాజిక బాధ్యత

**విశాలాంధ్ర-శింగనమల:** మండల పరిధిలోనిగుమ్మేపల్లి లో ఒక్కరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లను ప్రభుత్వం పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గుమ్మేపల్లి సర్పంచ్ దేగల లలితమ్మ రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి పేర్కొన్నారు. శింగనమల మండలం గుమ్మేపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలోసర్పంచ్ దేగల లలితమ్మ,రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు జనవరి 1వ తేదీ నూతన సంవత్సరం కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శింగనమల శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఒకరోజు ముందు డిసెంబర్31వ తేదీన పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ఉదయం 6 గంటల నుండి వృద్ధులకు వికలాంగులకు వితంతులకు ఇంటింటికి పింఛన్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు దేగల శ్రీనివాసులు దేగల నారాయణస్వామి. వడ్డే రామాంజనేయులు. లక్ష్మయ్య, ఓబులేసు, ఓబుళపతి, ఎర్రిస్వామి,సచివాలయ సిబ్బంది నవీన్, నాగార్జున, మోహన్,తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి కార్యకర్తలే బలం : మంత్రి సవిత

**విశాలాంధ్ర-పెనుకొండ :** టీడీపీకి కార్యకర్తలే అసలైన బలం, పార్టీకి ఊపిరి అని మంత్రి సవిత అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో విశేష సేవలు అందించిన ఉత్తమ కార్యకర్తలను గుర్తిస్తూ, టీడీపీ జాతీయ కార్యదర్శి మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రశంసాపత్రాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పెనుకొండ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో, ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికైన 151 మందికి మంత్రి సవిత ప్రశంసాపత్రాలను అందజేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వ పాలన ప్రజలకు, రాష్ట్రానికి శ్రీరామరక్షగా మారిందని, టీడీపీకి తరిగిపోని ఆస్తి కార్యకర్తలేనని మంత్రి సవిత స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా మరింత స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుండి, టీడీపీని తిరుగులేని శక్తిగా నిలపాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతి చెందిన గోవిందప్పను పరామర్శించిన వేణు రెడ్డి

**విశాలాంధ్ర-హిందూపురం :** కిరికెర గ్రామపంచాయతీ సిరికల్చర్ కాలనీలోగల, వైసీపీ సీనియర్ నాయకులు గోవిందప్ప అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ పార్టీ ముఖ్య నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి బుధవారం వారి భౌతిక కాయానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ మూర్తి, సీనియర్ నాయకులు నక్కలపల్లి శ్రీరామ్ రెడ్డి, ట్రాక్టర్ వెంకటరమణప్ప, మాజీ వార్డ్ మెంబర్ రామిరెడ్డి, సీనియర్ లీడర్ గంగాధరప్ప, హరికృష్ణ, నారాయణరెడ్డి వార్డ్ మెంబర్ మంజు, ఆనంద్, మనోజ్, ఎస్టిడి రామంజి, నాగరాజు, కోటిపి భాస్కర్ రెడ్డి తదితర వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విశాలాంధ్ర-ధర్మవరం:** ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలోని తారకరామాపురంలో గల బాలుర సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల నడుమ ఘనంగా విద్యార్థి సంఘం నాయకులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాజీ విద్యార్థి పెద్దన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాలు నాగార్జున, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాథ్, పట్టణ కార్యదర్శి అమన్‌లు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ ఏర్పడి నాటి నుంచి నేటి వరకు అధ్యయనం, పోరాటం, అనే నినాదాలతో స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యం సోషలిజం అనే ఆశయాలతో విద్యార్థుల కోసం అనేక పోరాటాలు చేస్తూ 55 సంవత్సరాలు పూర్తి చేసుకుని 56వ సంవత్సరంలో అడుగు పెట్టిందని వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, వరుణ్ తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు సేవ చేయడంలో సమాజం గుర్తిస్తుంది

**విశాలాంధ్ర- లేపాక్షి:** ఎన్నో మండలాలలో విధి నిర్వహణలో బాధ్యతగా ప్రజలకు సేవ చేసినప్పుడే సమాజం మనతో గుర్తిస్తుందని ఎంపీడీవో నరసింహార్తి పేర్కొన్నారు. పదవి విరమణ పొందిన మండల పరిషత్ అభివృద్ధి. అధికారి నరసింహమూర్తి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. వీరికి పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా మండల తాసిల్దార్ సౌజన్య లక్ష్మి మాట్లాడుతు పదవి విరమణ పొందుతున్న ఎంపిడిఓ నరసింహమూర్తి అతి తక్కువ కాలం లేపాక్షిలో పనిచేసినప్పటికి మండల అభివృద్ధితో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధుల మన్నలను పొంది మంచిపేరు సంపాదించారన్నారు. ఎంఆర్సీలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఎంఈఓ నాగరాజు మాట్లాడతు పాఠశాలలో పనిచేస్తు పదవి విరమణ పొందిన మహమ్మద్ రఫీక్ తన విధి నిర్వహణలో విద్యాభివృద్ధికి కృషి చేసారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఆదినారాయణ, ఇన్చార్జి ఎంపిడిఓ శ్రీనివాసులు: ఎంఈఓ నాగరాజు, డాక్టర్ వెంకటేసులు. టిడిపి మండల కన్వీనర్ అభిలాష్ జనసేన మండల అధ్యక్షుడు బాలాజీ బిజెపి మండల అధ్యక్షుడు నరసింహమూర్తి అధికారులు. ప్రజాప్రతినిధులు. సిబ్బంది పాల్గొన్నారు..

## వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలి

**విశాలాంధ్ర-గాండ్లపెంట:** 2026 నూతన సంవత్సర వేడుకలను శాంతి యుతంగా జరుపుకోవాలని ఎస్సై సుమతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, డీజేలు పెట్టడం, తదితర సంఘటనలకు పాల్పడినట్లైతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ముఖ్యంగా పోలీసు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించినట్లయితే పోలీసుల చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. కావున నూతన సంవత్సర వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

**విశాలాంధ్ర-తాడిపత్రి:** టీడీపీ బలోపేతానికి కృషి చేస్తానని టిడిపి పట్టణ నూతన అధ్యక్షుడు టాటా హాజీవలి పేర్కొన్నారు. బుధవారము పట్టణంలోని జెసి నివాసంలో తాడిపత్రి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా టాటా హాజీ వలి ఎన్నికైన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డి టాటా హాజీవలిని సన్మానించారు. ఈ సందర్భంగా జెసి. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తిస్తుందన్నారు. అందులో భాగంగానే తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం టాటా హాజీని టిడిపి పట్టణ అధ్యక్షుడుగా నియమించిందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన టిడిపి పట్టణ అధ్యక్షుడు టాటా హాజీవలి మాట్లాడుతూ తనపై నమ్మకం నుంచి ఇంత పెద్ద పదవి అప్పజెప్పినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డికి, మున్సిపల్ చైర్మన్ జెసి. ప్రభాకర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. తమ వంతు సహాయంగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తూ,ప్ టిడిపి పార్టీ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.

## మద్యం, మత్తు పదార్థాలు లేని కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుదాం

**విశాలాంధ్ర-ధర్మవరం:** మద్యం, మత్తు పదార్థాలు లేని కొత్త సంవత్సరానికి స్వాగతం పలకాలనీ జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ బషీర్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు తెలిపారు. ఈ సందర్భంగా శాంతి నగర్ మున్సిపల్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులారా మీ బిడ్డల్ని చదివించడానికి నిత్యం కష్టపడుతూ వారినీ, వారియొక్క ఆరోగ్యాన్నీ కంటికి రెప్పలా కాపాడుకుంటు న్నారన్నారు. మీ బిడ్డల భవిష్యత్తు కోసం మీ ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాల్సి వుందన్నారు. ప్రభుత్వ మద్యం అమ్మకాలను నియంత్రించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ నాయక్ , జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లోకేష్,సురేష్ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ప్రదీప్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జానకి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మండలంలో జోరుగా పింఛన్ల పంపిణీ

**విశాలాంధ్ర - విడపనకల్లు :** మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ పండుగలా కొనసాగుతోంది. బుధవారం ఉదయం నుండే సచివాలయ సిబ్బంది ,వాలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. మండల కేంద్రంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాధాకృష్ణ స్వయంగా పాల్గొని వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలో పింఛన్ల ఇప్పటి వరకు 93శాతం పంపిణీ పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన 7శాతం పింఛన్లను కూడా సాయంత్రం లోపు లేదా రేపు ఉదయానికల్లా పూర్తి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా లబ్ధిదారులు ఊర్లో లేకపోయినా లేదా వేరే కారణాల వల్ల అందుబాటులో లేకపోయినా, వారిని సంప్రదించి పింఛన్ అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ సత్యబాబు, పంచాయతీ కార్యదర్శి మహేశ్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ పంపిణీలో టీడీపీ కన్వీనర్

**విశాలాంధ్ర - నంబులపూలకుంట:** మండల కేంద్రంలోని పీర్ల చావిడి సమీపంలో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ నూతన కన్వీనర్ శ్రీరాముల నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పింఛన్ పథకం ద్వారా ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్నట్లు తెలిపారు. ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1ను పురస్కరించుకుని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఆనందంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేయించారని అన్నారు. ముందస్తుగా పెన్షన్ అందడంతో లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగరాణి, పంచాయతీ సెక్రటరీ రమేష్ నాయుడు, టీడీపీ నాయకులు మౌలాసాబ్, నరసింహారెడ్డి, వేణుగోపాల్, మహబూబ్ బాషా, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక శాఖ మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు

**విశాలాంధ్ర-నల్లచెరువు:** మండల కేంద్రంలోని జాతీయ రహదారి మీదుగా బుధవారం తిరుపతి నుండి అనంతపురం వైపు వెళ్తున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవును నల్లచెరువు మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ అశ్వర్థ నాయుడు ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు ఆయను మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి శాలవాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులతో కలిసి తేనేటి విందులో పాల్గొని ఆప్యాయంగా టిడిపి నాయకులతో ముచ్చటించారు. అందరితో కలిసి టీ తాగారు. మండలంలోని పార్టీ స్థితిగతులపై ప్రజలకు కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజల్లేకి తీసుకెళ్లాలని అన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్ నాయుడు, సతీష్ చౌదరి, రాజా, ఐటీడీపీ మండల కన్వీనర్ రాళ్లపల్లి బాలాజీ, వర్ల భరత్, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు కెప్టెన్ దీపికకు సన్మానం

**విశాలాంధ్ర-గుడిబండ :** జనవరి 1న నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని నీలకంఠాపురంలో గురువారం ఉదయం 10:30 కు దేవాలయ ఆలయ ధర్మకర్త కమిటీ చైర్మన్ మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ అమరాపురం మండలం తంబలహట్టి గ్రామానికి చెందిన కుమారి దీపికకు ఘనంగా సన్మానం ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కరికెర సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలకంఠాపురం దేవస్థానాల కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి 5 మండలాల క్రీడాకారులు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కెప్టెన్ దీపిక సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలి

## మాజీ ఎంపీ తలారి రంగయ్య డిమాండ్

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం:** మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ఉల్లంఘించిన కౌన్సిలర్లపై తక్షణమే అనర్హత వేటు వేయాలని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కళ్యాణదుర్గంలోని ఆర్డీవో కార్యాలయంలో ఎన్నికల అధికారి (ఆర్డీవో) వసంత బాబును ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్ ఎన్నికల ప్రక్రియలో పార్టీ జారీ చేసిన అధికారిక విప్‌ను కొందరు కౌన్సిలర్లు బేఖాతరు చేశారని విమర్శించారు. నిబంధనల ప్రకారం విప్‌ను ఉల్లంఘించిన వారిపై అనర్హత వేటు వేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల అధికారులు ఈ అంశంపై స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే తదుపరి కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మండలాల కన్వీనర్లు, పార్టీ లీగల్ సెల్ నాయకులు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**విశాలాంధ్ర-యాడికి :** తాడిపత్రి శాసనసభ్యులు జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు దడియాల ఆదినారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా హాస్పిటల్ కాలనీ చౌడేశ్వరి కాలనీలలో దడియాల ఆదినారాయణ ఆధ్వర్యంలో ఆయన చేతుల మీదుగా వృద్ధులు వికలాంగులు వితంతువలకు పెన్షన్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారులకు సమయానికి ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నామన్నారు. నూతన సంవత్సరానికి ముందే పెన్షన్ పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందని పెన్షన్ లబ్ధి దారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. సచివాలయ సిబ్బంది హరినాథ్ జీవిత, టిడిపి నాయకులు వెంకటస్వామి నాగరాజు, భాస్కర్ చంద్రశేఖర్ రెడ్డి,ఆంజనేయులు హుస్సేన్ భాష మునీంద్ర రాఘవేంద్ర, రమణ,రామకృష్ణ ఉదయ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ

**విశాలాంధ్ర-రొళ్ల:** మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం మండల టీడీపీ నాయకులు వృద్యాపు పింఛన్లు పంపిణీ చేసారు వన్నార్లహల్లిలో మాజీ జడ్పీటీసీ వి.యం పాండురంగప్ప,పంచాయితీ అధ్యక్షులు నారాయణప్ప, మారుతీ కాలోనిలో తెదేపా మండల కన్వీనర్ జీ.కె ఈరన్న,సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి ఏపీఐఐసి రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ, ఎమ్.రాయపురం గ్రామంలో తెదేపా మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడు,పంచాయితీ అధ్యక్షులు నారాయణప్ప చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షులు శంకర్ గౌడు,రామకృష్ణ పంచాయితీ ప్రధాన కార్యదర్శి బిళియన్న దాసప్పపాళ్యంలో బిసి సెల్ మండల అధ్యక్షులు దాసప్పపాళ్యం నాగరాజు గౌట్టుగురికిలో పంచాయితీ అధ్యక్షులు శ్రీనివాసులు,యూనిట్ ఇంచార్జ్ హేమంత్ కుమార్ వన్నాప్పపాళ్యంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కృష్ణ మూర్తి ఎల్ కె పల్లి గ్రామంలో వైస్ సర్పంచ్ రాజు టీఎన్‌టీయుసి పార్లమెంట్ ఉపాధ్యక్షులు బ్యాడగేరి మూర్తి,ఆసుపత్రి కమిటీ సభ్యులు బ్యాడగేరి కాంతరాజు,పెన్షన్ లు,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు మడకశిర శాసనసభ్యులు టీడీపీ బోర్డు మెంబర్ ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వా మిల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ల పంపిణీ కార్యక్ర మాన్ని చేపట్టారు.వృద్ధులు వితంతువులు,ఒంటరి మహిళలు, దివ్యాంగులు ఇలా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే పెన్షన్ అందించాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు టిడిపి నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి వెళ్ళి ఉదయం 7 గంటల నుంచి పెన్షన్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేసారు.

## పిల్లలకు మిఠాయిలు పంపిణీ

**విశాలాంధ్ర-తాడిపత్రి:** పట్టణంలోని ఎరుకల కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంగన్వాడి టీచర్ నాగేశ్వరమ్మ సమక్షంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ప్రశాంతి ఆధ్వర్యంలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ పేద ప్రజలకు, పేద విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో 2025 సంవత్సరంలో తమ వంతు సహాయ, సహకారాలు అందజేశామన్నారు. 2026 కొత్త సంవత్సరంలో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి తమ వంతు కృషి చేస్తామని పేదలకు భరోసా ఇచ్చారు. అనంతరం అంగన్వాడి కేంద్రంలోని టీవీకి పెన్ డ్రైవ్, పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఒక్కరోజు ముందుగానే పింఛన్ల పంపిణీ

**విశాలాంధ్ర-డి.హీరేహాళ్:** మండలంలోని గోడిసల పల్లి గ్రామంలో బుధవారం మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత రెడ్డి పెన్షన్ పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఆదేశాల మేరకు పెన్షన్లు ఒక రోజు ముందుగానే పంపిణీ చేసినట్లు హనుమంత రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. కద లూరు గ్రామంలో మండల కన్వీనర్ మోహన్ రెడ్డి పెన్షన్ పంపిణీ చేశారు మురడి గ్రామంలో ఎంపిటిసి తలారి గంగాధర పెన్షన్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, రైతులు, గ్రామస్తులు అందరూ దేవుడి దయతో మంచి పంటలు పండించి, అష్టైశ్వర్యాలతో, ఆరోగ్యంగా కుటుంబ సభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

## అమరాపురం విద్యార్థులకు బస్సును నడపాలి

**విశాలాంధ్ర-అమలాపురం :** అమరాపురం మండల ప్రాంతంలోని అగ్రహారం నుంచి అమరాపురం లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు స్కూల్ బస్సు సదుపాయం లేకపోవడంతో తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ప్రతిరోజూ దూరదూరం నడుచుకుంటూ, వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణిస్తూ పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థుల భద్రత దృష్ట్యా తక్షణమే స్కూల్ బస్సు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులను తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు విజ్ఞప్తులు చేసినా చర్యలు లేవంటూ స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలోపు అధికారులైనా మేల్కొని వి అగ్రహారం టు అమరాపురం వరకు స్కూల్ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గ్రామాలలో డ్రైడే ఫ్రైడే

**విశాలాంధ్ర-యాడికి:** మండలంలోని రాయల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వేములపాడు కొట్టాలపల్లి గ్రామాలలో ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దేవరాజన్ ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు 104కి వచ్చిన ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రైడే ఫ్రైడే గురించి ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే గ్రామాలలో తప్పక పాటించాలన్నారు డాక్టర్ దేవరాజు వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ షుగర్ ఉన్న వారికి మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడి స్కూల్ ను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ షబ్బీర్ అహ్మద్ ఎంఎల్ హెచ్‌పి కవిత ఆశ కార్యకర్త సువర్ణ పాల్గొన్నారు.